# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్‌లోనే అత్యాధునికమైన షిప్ టెక్నాలజీ సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్నామని కేంద్రమంత్రి సర్బానంద్ సోనోవాల్ తెలిపారు.
- గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలను మరింత విస్తరింపచేయాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ వైద్యులకు సూచించారు.
- బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై పోక్సో కేసులు నమోదు చేసి.. కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.
- గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు.

====================

భారత్‌లోనే అత్యాధునికమైన షిప్ టెక్నాలజీ సెంటర్‌ను విశాఖపట్నంలో 305 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్నామని కేంద్ర నౌకాయాన, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్ తెలిపారు. విశాఖపట్టణంలో పోర్టు అథారిటీ చేపట్టబోయే పలు ప్రాజెక్టులకు విశాఖపట్టణం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ తో కలిసి కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2047 నాటికి ప్రపంచ మెదటి 5 నౌకా నిర్మాణ దేశాలలో భారత్ ఒకటిగా నిలవాలనేది కేంద్రప్రభుత్వ ధ్యేయమన్నారు. దీనిలో భాగంగా ఏర్పాటు కానున్న షిప్ టెక్నాలజీ కేంద్రం ద్వారా నౌకాయాన రంగానికి పరిశోధన, అభివృద్ధి (R&D), డిజైనింగ్ కు సంబంధించిన కార్యక్రమాలు అభివృద్ధి చేయబడతాయని తెలిపారు. దేశంలో నౌకా నిర్మాణం, మరమ్మతుల రంగానికి మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి పని చేస్తున్నామని సర్బానంద్ సోనోవాల్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో వైద్యులు, వైద్య కళశాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి రంగరాయ వైద్య కళాశాలలో నూతన భవన నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైద్యులతో ముఖాముఖి నిర్వహించిన ఉపముఖ్యమంత్రి గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్యులు చేస్తున్న కృషి రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

అంతకుముందు పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. సుద్దగడ్డ కాలువపై నిర్మించిన వంతెన పనుల నాణ్యతను పరిశీలించి.. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సుద్దగడ్డ కాలువపై ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో 3 కోట్ల 05 లక్షల రూపాయల అంచనా వ్యయంతో రహదారులు, భవనాల శాఖ ఈ వంతెన నిర్మించింది.

====================

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2026 న్యూఢిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతోంది. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ.. సాంకేతికత, వ్యవస్థాపకత, సుపరిపాలన, సామాజిక అభివృద్ధి వంటి రంగాలలో పరిష్కారాలను అందించడానికి ఈ కార్యక్రమం యువతను ప్రోత్సహిస్తుందని చెప్పారు. వికసిత్ భారత్@2047 లక్ష్యసాధనకు అనుగుణంగా యువతలోని ప్రతిభను, సృజనాత్మకతను గుర్తించేందుకు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి 75 కోట్ల రూపాయల క్రీడా నిధులను మంజూరు చేసినందుకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు అదనపు ఖేలో ఇండియా కేంద్రాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియా ద్వారా 675 కోట్ల రూపాయల క్రీడా మౌలిక సదుపాయాల కల్పించాలని కోరారు.

విరామం

====================

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై పోక్సో కేసులు నమోదు చేసి.. కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కె.ఎల్. యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలో నేరాలు 4 శాతం తగ్గాయన్నారు. సోషల్ మీడియా ద్వారా ఆకతాయిలు చేసే వేదింపుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటే ఈగల్ టీమ్ కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని మంత్రి అనిత తెలిపారు.

====================

చారిత్రక వైభవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకయిన గండికోట ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... వైఎస్ఆర్ కడప జిల్లా చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గండికోట ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ.. రేపటి నుండి మూడు రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

====================

పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేలా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న ఆయుర్వేద ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జన్నూరులో మరో 30 లక్షల రూపాయలతో ఆయుర్వేద ఆసుపత్రి నూతన భవన నిర్మాణం చేస్తామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

చిత్తడి నేల ప్రాంతాల పరిరక్షణ, సుస్థిర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ - 2026లో భాగంగా ఈరోజు శ్రీసిటీలో ఏర్పాటు చేసిన చిత్తడి నేలల పరిరక్షణ, సుస్థిర పర్యాటకం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ ను నేటి నుండి మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రం, తేమ భూముల పరిరక్షణను స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ప్రత్యేక సాంకేతిక సమావేశం నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

====================

కృష్ణా, గోదావరి బేసిన్ పరిధిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఈ నెల 5న సంభవించిన గ్యాస్ విస్ఫోటనం కారణంగా వ్యాపించిన మంటలు ఈ రోజు పూర్తిగా అదుపులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. మంటలు అదుపులోకి రావటం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

====================

====================